క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తంబళ్లపల్లె: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. గుండ్లపల్లె పంచాయతీ మొరుపుపల్లె బురుజుకు చెందిన జి.సిద్దారెడ్డి(67) తంబళ్లపల్లెకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో కడప నుంచి వరిగడ్డిలోడుతో వచ్చిన ట్రాక్టర్ గడ్డి తగిలి కిందపడగా ట్రాక్టర్ వెనుక చక్రం కాలుపై వెళ్లింది. రక్తస్రవం ఎక్కువై అపస్మారక స్థితిలోకి వెళ్లగా స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది క్షతగాత్రుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని ములకలచెరువు–బి.కొత్తకోట రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పీటీఎంకు చెందిన నాగరాజు (45) ద్విచక్ర వాహనంలో వస్తూ ఓ కారును వేగంగా వచ్చి ఢీకున్నాడు. ద్విచక్ర వాహనదారుడి కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి.

సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం

వాల్మీకిపురం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని గండబోయనపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుచరణ్ మాట్లాడుతూ 1848 ఏప్రిల్ 16న రాజమండ్రిలో జన్మించారని,1869లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసి, మూడు దశాబ్దాల పాటు తెలుగు పండితుడిగా పని చేసి తెలుగుబాషా వికాసానికి ఎనలేని కృషి చేశారన్నారు. అలాగే 130కి పైగా గ్రంధాలు, 1903పైగా వ్యాసాలు వ్రాశారన్నారు. ఆయన కృషితో 1881 డిసెంబర్ 11న రాజమండ్రిలో మొదటి వితంతు వివాహం జరిపించడంతో పాటు సుమారు 40 వితంతు పునర్వివాహాలు జరిపించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రెడ్డి మోహన్, ఉపాధ్యాయులు కిషోర్, శేఖర్, సిలార్‌బి, సిరాజున్నిసా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు.. ఆదాయానికి మలుపు

పీలేరు రూరల్ : ఆర్టీసీలో ఇంధన పొదుపు.. ఆదాయానికి మలుపు అని డీఎం కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో అత్యంత మెరుగైన ఇంధన పొదుపు, ఆదాయం సాధించిన సిబ్బందికి అభినందనలు తెలిపి క్యాష్ అవార్డులు అందజేశారు. క్యాష్ అవార్డులు అందుకున్న వారిలో డ్రైవర్లు బి.ఆర్.సి. నాయక్, గోవిందు, కండెక్టర్లు పి. మస్తాన్, కె. రఘు, సి.ఆర్. బాబు ఉన్నారు. వీరిని మిగతా ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎస్టీఐ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించండి

గుర్రంకొండ: వేసవిలో గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అమిలేపల్లె, టి.పసలవాండ్లపల్లె, ఎల్లుట్ల, చెర్లోపల్లె గ్రామసచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతు ప్రస్తుతం మండుతున్న ఎండలకు గ్రామాల్లో తాగునీటి బోర్లలో నీటి మట్టం తగ్గిపోతోందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. చేతిపంపులు బాగుచేయించడం, బోర్లలో అదనపుపైపులు ఏర్పాటు చేసుకోవడం, అవసరమైనచోట పంచాయతీ తీర్మానంతో రీబోర్లు వేయడం వంటి పనులు పంచాయతీల ద్వారా చేపట్టవచ్చన్నారు. వేసవి కాలం ముగిసే వరకు గ్రామాల్లో తాగునీటి సమస్యలు, బోర్లలో నీటిమట్టంపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు.

చదువుల్లో రాణించడానికి ఆరోగ్యమూ అవసరమే

–ప్రకృతి వనం ప్రసాద్

కురబలకోట: విద్యార్థులు చదువుల్లో చక్కగా రాణించాలంటే ఆరోగ్యం కూడా ప్రాముఖ్యమైనదని గుర్తించాలని మదనపల్లె దగ్గరున్న ప్రకృతి వనం నిర్వాహకులు ప్రకృతి వనం ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన అంగళ్లు దగ్గరున్న విశ్వం సీబీఎస్సీ స్కూల్ వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నాణేనికి బొమ్మా బొరుసులా విద్యార్థులకు ఇటు చదువు..అటు ఆరోగ్యం అవసరమన్నారు. అసలు మనిషి మనుగడకు ఆరోగ్యం పునాదిలాంటిదన్నారు. ఆరోగ్యానికి ఆహారం కీలకమన్నారు. ఆరోగ్యంలో భౌతిక, సామాజిక, మానసిక శ్రేయస్సు ఇమిడి ఉంటాయన్నారు. జీవన విధానం, ఆహారపు అలవాట్ల ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లల మార్కుల పట్లే కాకుండా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆట పాటల ద్వారా వినోదంతో పాటు బుద్ధి వికాసం, చురుకుదనం కల్గి ఉంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆనందలహరి మాస్టర్ పాఠశాల డీన్ ఎస్. ప్రభాకర్ శాస్త్రి, ప్రిన్సిపాల్ రోజ్లిన్ ప్రియా, పాఠశాల సలహాదారు డాక్టర్ కాశయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

ఇంటింటా ప్రచారంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


పల్లవోలు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: పేదల అభివృద్ధే లక్ష్యంగా పని చేసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఓటుతో ఆశీర్వదించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. మండలంలోని పల్లవోలు గ్రామం గడిలో మంగళవారం సాయంత్రం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదల బతుకులు ఎంతో మెరుగుపడ్డాయని, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులు, గ్రామ గ్రామాన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రాష్ట్రంలో నూతన అధ్యాయానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం నుంచి మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి కోరుతున్నారని, అదే ప్రతి పక్షాలు టీడీపీ, జనసేన, బీజేపీలు వైఎస్సార్‌సీపీని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక కూటమిగా జతకట్టారన్నారు. అంతే కాకుండా జగన్‌ను దొంగదెబ్బ తీయడానికి దాడులకు పాల్పడుతున్నారని, ఇటువంటి కూటమిని ప్రజలు తరిమికొట్టాలన్నారు. మైనార్టీ సోదరుల హక్కులను కాలరాసే బీజేపీతో జత కట్టిన టీడీపీకి మైనార్టీలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాకతీతంగా ప్రతి వర్గానికి మేలు చేయడమే జగన్ మోహన్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని, గత ఐదేళ్లలో జరిగిన సంక్షేమమే ఇందుకు నిదర్శమని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, ఎంపీటీసీ రమణప్రతీప్‌రెడ్డి, నాయకులు జుబేర్ అహ్మద్, ఇస్తియాక్, వెంకటరెడ్డి, జునేద్, మధుసూదన్‌రెడ్డి, రెడ్డెప్ప, రమణారెడ్డి, శివాజీ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది రెండునాల్కల ధోరణి

గుర్రంకొండ: చంద్రబాబు నాయుడు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నాడని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లను విధుల్లో నుంచి తొలగించి మళ్లీ వలంటీర్లకు రూ.10 వేలు జీతం ఇస్తాని చెప్పడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. టీడీపీ వాళ్లు పింఛన్‌దారుల గోడు మూటగట్టుకొన్నారన్నారు. వలంటీర్లులేకపోతే ఎలాం ఉంటుందో టీడీపీ వాళ్లకు మూడురోజులుగా అర్థమయ్యిందన్నారు. ఎంతో మంది వృద్ధులు, వికలాంగులు మండుటెండలో సచివాలయల దగ్గర పడిగాపులు కాస్తుండడం దారుణమన్నారు. టీడీపీ బీజేపీతో జతకట్టడంతో మైనార్టీల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిగానీ, టీడీపీ అభ్యర్థి కిషోర్‌కుమార్‌రెడ్డి ఎన్నడూ ప్రజల మధ్య ఉండలేదన్నారు. హైదరాబాద్‌లో కాలం గడుపుతూ ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజల్లోకి వస్తారన్నారు. ఇలాంటి వారిని నమ్మి ఓట్లు వేస్తే ప్రజలు మరోసారి మోసపోతారన్నారు. రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరముందన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు ఇంటికి ఇంటికి వెళ్లి అనునిత్యం ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం, జగనన్న చేసిన మేలును ప్రజలకు గుర్తు చేసి వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ రవినాయక్, జెడ్పీటీసీ సమీన్‌ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ నాగేంద్ర, వైస్ఎంపీపీ కరుణాకర్, మండల ప్రత్యేక అహ్వానితులు అప్పల్ల, ఎల్వీ రమణ, తరిగొండ ప్రకాష్‌రెడ్డి సింగిల్‌విండో డైరెక్టర్ రెడ్డి కుమార్, మాజీ ఎంపీపీ జమీర్, మాజీ వైస్ ఎంపీపీలు రెడ్డినరసింహారెడ్డి, సర్పంచ్‌లు గోపాల్‌నాయుడు, రౌనక్‌బాషా, నాయకులు సురేష్, నరసింహారెడ్డి, గంగిరెడ్డి, బివిరెడ్డి పాల్గొన్నారు.

18న పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నామినేషన్


పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: తంబళ్లపల్లె వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఈనెల 18న ఉదయం 11 గంటలకు తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో నామినేషన్ కార్యక్రమానికి తరలిరానున్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఏవీ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఓటమిపాలవ్వడంతో ఆయన రాజకీయాలకు దూరమయ్యారు. దీనితో పార్టీ అధిష్టానం పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని తంబళ్లపల్లె సమన్వయకర్తగా నియమించింది. 2016 అగష్టు 4న ఆయన నియోజకవర్గంలో తొలిసారి పర్యటన ప్రారంభించారు. గత 2019 ఎన్నికల్లో తొలిసారి అసెంబ్లీకి పోటీచేసిన ఆయన రికార్డుస్థాయి విజయాన్ని నమోదు చేశారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఏ అభ్యర్థికి దక్కని మెజార్టీ సాధించారు. పోలైన ఓట్లలో ఆయనకు 1,05,444 ఓట్లు రాగా, 46,938 ఓట్ల మెజార్టీ దక్కింది. తంబళ్లపల్లె ప్రజలు చూపిన ఆదరణతో నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశారు.

ఆశీర్వదించండి:

రెండవసారి అభ్యర్థిగా పోటీచేసేందుకు సీఎం వైఎస్ జగన్ అవకాశం ఇచ్చారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు చూపిన ఆదరణవల్లే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరించడం, మౌలిక వసతుల కల్పన, రహదారులు, భవనాలు, ఆస్పత్రుల అభివృద్ధి, పేదలకు పక్కా గృహాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయగలిగామన్నారు. ఈ ఎన్నికల్లో మీ బిడ్డగా ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికే పట్టం కట్టండి


వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కురబలకోట: ప్రజా సంక్షేమం కోసం మళ్లీ జగన్‌కే పట్టం కట్టాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ కోరారు. మంగళవారం ఆమె కనసానివారిపల్లె, అంగళ్లు సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆగ్రామ సర్పంచులు ఆర్కే కృష్ణా రెడ్డి, పోరెడ్డి విశ్వారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఓటర్లతో ఆమె మాట్లాడుతూ కులమతాలకు పార్టీలకు అతీతంగా సీఎం జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి బ్యాంకుల్లో నగదు జమ చేశారన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చంద్రబాబు బూటకపు మాటలు నమ్మవద్దన్నారు. పద్మశాలి రాష్ట్ర డైరెక్టర్ సురేంద్రనాథ్, జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి. దస్తగిరి, ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, మొలక త్రివేణి, నిర్మల. సురేంద్ర రెడ్డి, వసంతరెడ్డి, ముత్ర దాము, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, నల్లగ్గారి బయ్యారెడ్డి, జంగావారిపల్లె విశ్వనాధరెడ్డి, భార్గవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎం. సుబ్బారెడ్డి, వన్ను కొండారెడ్డి, ఎం. రవీంద్రరెడ్డి, అమరనాధరెడ్డి, మొలక గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

పెద్దిరెడ్డి కవితమ్మ సమక్షంలో మంగళవారం నాయనవారిపల్లె వెంకట్రమణారెడ్డి, తుంగావారిపల్లె తోట్ల రమణ, తోట్ల ఉత్తన్న టీడీపీ నుండి వైఎస్సార్ సీపీలో చేరారు. కనసానివారిపల్లె ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. జగన్ పాలన నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం పాటుపడతామని తెలిపారు .

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి

– జేసీ ఫర్మాన్ అహ్మద్


పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్

మదనపల్లె : ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్ సూచించారు. మంగళవారం మదనపల్లె పర్యటనలో భాగంగా... బీటీ కళాశాలలో పీఓ, ఏపీఓలకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. శిక్షణలో పీఓ, ఏపీఓలు నేర్చుకుంటున్న అనేక అంశాలపై వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. మాక్ పోలింగ్ ఎప్పుడు నిర్వహించాలి. మాక్ పోలింగ్‌లో ఈవీఎం మొరాయిస్తే.. ఏం చేయాలి అంటూ పీఓలను ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీప్యాట్ల పనితీరుపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పీఓ, ఏపీఓల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్‌రోజున, సంబంధిత పోలింగ్‌బూత్‌లో పీఓదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీపోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టిపరిస్థితుల్లోనూ తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. ప్రతిచోటా పోలింగ్‌కు 90నిమిషాలు ముందే తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని చెప్పారు. మాక్‌పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీ ప్యాట్లు ఖాళీచేసి సీల్ చేయాలని సూచించారు. అనంతరం జెడ్పీహైస్కూల్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించి, నిర్వహణపై సిబ్బందికి పలుసూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్వో హరిప్రసాద్, డీఎస్పీ ప్రసాదరెడ్డి, ఏఈఆర్వో, తహసీల్దార్ రమాదేవి, డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, టూటౌన్ సీఐ యువరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారి పల్లి పంచాయతీ బురుజుపల్లికి చెందిన క్రిష్టప్ప అనే వ్యక్తి వద్ద లభించిన 66 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని మంగళవారం పోలీసులు సీజ్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

చెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని ఎస్‌బిఐ వద్దనున్న పెద్ద పచ్చారు చెట్టును కొట్టివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మదనపల్లె టౌన్ వెల్ఫేర్ అపెక్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు మంగళవారం సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. అనుమతి తీసుకోకుండా రాత్రికి రాత్రే చెట్టును తొలగించారన్నారు. చెట్టు నరికివేసిన వారిపై వాల్టా చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు వై.ఎస్.మునిరత్నం, టీఎస్‌పి కృష్ణమూర్తి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

పీలేరు : అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన సంక్షేమ పాలకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలోని విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కులమత వర్గ విభేదాలు లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మరింత అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యండపల్లె శ్రీనివాసులురెడ్డి, జి.వి. రాకేష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జీనత్ షఫీ, వైస్ ఎంపీపీ ఎస్.వి. చలపతి, నాయకులు శ్రీనాథరెడ్డి, ఎ.ఎస్. హుమయూన్, గుర్రం బాను, చక్రధర్, లోకనాథరెడ్డి, షాజహాన్, ఇబ్రహీం ,జయపాల్‌రెడ్డి, నాగరాజనాయక్, జోహార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను గెలిపించుకుందాం

- టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్


కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పని చేస్తానని వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిస్సార్‌అహ్మద్ తెలిపారు. మదనపల్లె మండలం పరిధిలోని పోతబోలు, తట్టివారిపల్లె పంచాయతీ, పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్ కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్మన్ షమీంఅస్లాం, మున్సిపల చైర్మన్ మనూజారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. తట్టివారిపల్లె పంచాయతీలో మార్కెటకమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ వైఎస్సార్ సీపీ నాయకులకు క్రేన్ సహాయంతో భారీ గజమాలను అలంకరించి ఘనస్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధి వివరాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అర్హులందరికి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిందని తెలిపారు. టీడీపీ నాయకులు చెబుతున్న బూటకపు మాటలను నమ్మవద్దని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ గెలిచిన తర్వాత మర్చిపోయి తన సొంత లబ్ధి కోసం రాష్ట్ర ప్రజల సొమ్ము దోచుకునే నీచమైన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. జగనన్న ప్రభుత్వం వల్ల మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని గ్రామస్తులను తెలియజేశారు. రానున్న రోజుల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెగా మేనిఫెస్టోని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోతబోలు సర్పంచు ఈశ్వరయ్య, సిద్ధలదీపా, వేమారెడ్డి, వెలుగుచంద్ర, డాక్టర్‌అనిల్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, మండల అధ్యక్షులు దండు కరుణాకర్ రెడ్డి, బి.అక్కులప్ప, డిష్ రామకృష్ణారెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల కోసం ప్రత్యేక మేనిఫెస్టో


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జల్లా లలితమ్మ, సిబ్బంది

మదనపల్లె సిటీ: బాలల కోసం ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించామని, దీనిని అన్ని రాజకీయ పార్టీల నాయకులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ బాలల హక్కుల ప్రజాధ్వని రాష్ట్ర అధ్యక్షురాలు జల్లా లలితమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఏవీ నాయుడు కాలనీలోని ఫోర్డు కార్యాలయంలో బాలల మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరించారు. పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎన్‌సిసి స్థాపించాలన్నారు. పిల్లలకు జీవన నైపుణ్యాకలపై అవగాహన కల్పించాలని, 1 నుంచి 12 తరగతి వరకు పిల్లలందరికి ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలని, ఐసీడీఎస్ కేంద్రాలు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ఉచిత నిర్బంధ హక్కు చట్టాన్ని 3 నుంచి 18 సంవత్సరాల వరకు వర్తింపజేసే విధంగా సవరించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు పాఠశాల విద్యకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది రాధమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేయాలి

–మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి


రామసముద్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

రామసముద్రం: మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహమ్మద్ , రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డిల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన రామసముద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోకసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందాయాని తెలిపారు. కార్యకర్తలు , నాయకులు అందరు కలసికట్టుగా వైఎస్సార్‌సీపీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. తమ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి , జెడ్పీటిసి రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, నాయకులు రమణారెడ్డి, నంద, భాస్కర్‌గౌడ్, కృష్ణారెడ్డి, ప్రకాష్, గెవన్న, సుబ్రమణ్యం, జయరామిరెడ్డి, తపాలామస్తాన్, బాబా, శివ, కృష్ణప్ప, మహబూబ్‌బాషా, హైదర్‌వల్లి , మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


కేవీపల్లె : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని సీకేఆర్‌పల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలను పాఠశాలలకు పంపుతారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు సితారుద్దీన్, సుబ్బమ్మ, వేగన, చంద్రకళ, నందకుమార్, సుబ్రమణ్యం, జయరాం, ఖాదర్‌బాషా, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న చింతల సాయిక్రిష్ణారెడ్డి, చింతల శివానందరెడ్డి

వాల్మీకిపురం: గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కుమారుడు చింతల సాయిక్రిష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానంద రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చెరుకువారిపల్లి, జమ్మిళ్లపల్లిలో ఇంటింటికి పర్యటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పేదలు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలకూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రారెడ్డి, సత్య, కేశవ, ప్రియరంజన్‌రెడ్డి, నరసింహులు, యుగంధర్ రెడ్డి, రామక్రిష్ణ, విక్రమ్ రెడ్డి, రామ్మూర్తి, షాహెద్, లవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు


జలాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు

పీలేరు రూరల్ : పట్టణంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం స్థానిక సదుం మార్గంలో శ్రీ కల్యాణ సీతారామస్వామి వారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. స్థానిక వినాయకస్వామి ఆలయం నుంచి సదుం మార్గంలోని రామాలయం వరకు జలం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. సీతారాములవారికి వారికి ఘనంగా జలాభిషేకం చేపట్టారు. అనంతరం ధ్వజారోహణం, గణపతి హోమంతో ఉత్సవాలు ప్రారంభించారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలోనూ స్వామివారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ములకలచెరువు: అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలని ములకలచెరువు సర్కిల్ ఫైర్ అధికారి క్రిష్ణయ్య ప్రజలను కోరారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానికంగా ఉండే ఇండియన్ గ్యాసు ఆఫీస్, హెచ్‌పీ పెట్రోల్ పంప్‌ల వద్ద గ్యాస్ ఉపయోగంపైన డెమో నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక యంత్రంలోని పరికరాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

వాల్మీకిపురం: వైఎస్సార్ సీపీదే నియోజకవర్గంలో విజయం ఖాయమని, ఓటింగ్ శాతం పెంచి మెజార్టీ పెంచేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. మంగళవారం పునుగుపల్లి, మంచూరు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి, వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని, ఎంపిగా మిథున్ రెడ్డిని, సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుని మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామాల్లో ప్రజాపాలన అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనన్నారు.రాష్ట్రస్థాయి సచివాలయంతో సమానంగా గ్రామస్థాయి సచివాలయం ఏర్పాటుతో ఇంటింటికి ప్రభుత్వ సేవలు చేరువయ్యాయన్నారు. ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ కలీమ్, కేశవ రెడ్డి, ఆఘా మొహియుద్దీన్, ఇబ్రహీం, చికెన్‌మస్తాన్, సైపుల్లా, చిన్నా, నాగరాజ, శంకర్‌రెడ్డి, భాస్కర్, రాయుడు, ఆనంద, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

69 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా


రాజీనామా చేసిన గ్రామ వలంటీర్లు

పీలేరు రూరల్ : మండలంలో 69 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ ఉపేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రాఘవేంద్రనగర్ 3వ గ్రామ సచివాలయం పరిధిలో 30 మంది, అగ్రహారంలో 9 మంది, గూడరేవుపల్లెలో 9 మంది, ముడుపులవేములలో 16 మంది, తలపుల గ్రామ సచివాలయంలో 5 మంది తమ రాజీనామ పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవడానికే తాము రాజీనామా చేసినట్లు తెలిపారు.

వాల్మీకిపురం: వాల్మీకిపురంకు చెందిన నాలుగు సచివాలయాల వలంటీర్లు, మండలంలోని తాటిగుంటపల్లి, మూరేవాండ్లపల్లి, గండబోయనపల్లి పంచాయతీలకు చెందిన వలంటీర్లు మూకుమ్మడిగా తమ వలంటీరు విధులకు రాజీనామా చేశారు. రాజకీయపరంగా వలంటీర్లపై అనవసర ఆరోపనల నేపథ్యంలో తమ విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు మంగళవారం ఎంపిడివో సుధాకర్ రెడ్డికి మూకుమ్మడిగా రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్థానికంగా మాకు గ్రామంలోనే సేవ చేయడానికి అవకాశం కల్పించారన్నారు.

కేవీపల్లె : మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 62 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో యాదవేంద్ర తెలిపారు. మంగళవారం మండలంలోని ఎంవీపల్లె గ్రామ సచివాలయం పరిధిలో 24 మంది, గర్నిమిట్టలో 16 మంది, గ్యారంపల్లెలో 12, తీతవగుంటపల్లెలో 10 మంది రాజీనామా చేసినట్లు తెలిపారు. వలంటీర్లు మాట్లాడుతూ ఎన్నికల్లో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి తమ మద్దతు ఇవ్వడానికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.